



# వార్త మిర్రర్

తెలుగు దినపత్రిక

గురువారం,
ఫిబ్రవరి 12, 2026

సంపుటి : 10 | సంచిక :14 | రంగారెడ్డి | ఎడిటర్ బి. శ్రీధర్ యాదవ్ | పేజీలు 8 | వెల 4/-


# 73.01% ఓటింగ్

**రాష్ట్రవ్యాప్తంగా ప్రశాంతంగా మున్సిపల్ ఎన్నికలు**

**116 మున్సిపాలిటీలు, 7 కార్పొరేషన్లలో పోలింగ్ పూర్తి**

**మున్సిపాలిటీల్లో 75.88%, కార్పొరేషన్లలో 66.05% నమోదు**

**సంగారెడ్డి, నిజామాబాద్ ఘటనలపై నివేదిక కోరిన ఎస్ఈసీ**

**రేపు ఓట్ల లెక్కింపు.. టేబుళ్ల చుట్టూ తొలిసారి ఫెన్సింగ్**

హైదరాబాద్: రాష్ట్రంలోని 123 పురపాలక సంఘాలకు బుధవారం నిర్వహించిన సాధారణ ఎన్నికలు ప్రశాంతంగా ముగిశాయి. మొత్తం కలిపి 73.01 శాతం పోలింగ్ నమోదైనట్లు రాష్ట్ర ఎన్నికల సంఘం ప్రకటించింది. 116 మున్సిపాలిటీల్లో 75.88 శాతం, 7 మున్సిపల్ కార్పొరేషన్లలో 66.05 శాతం ఓటింగ్ నమోదైంది. మున్సిపాలిటీల్లో చౌటుప్పల్‌లో అత్యధికంగా 91.91 శాతం పోలింగ్ జరగగా, నందికొండలో అత్యల్పంగా 59.68 శాతం నమోదైంది. కార్పొరేషన్లలో నల్లగొండ 77.36 శాతంతో ముందంజలో ఉండగా, నిజామాబాద్ 59.12 శాతంతో చివరిస్థానంలో నిలిచింది. చెదురుమదురు ఘటనలు మినహా ఎక్కడా పెద్ద అంతరాయాలు కలగలేదని ఎన్నికల సంఘం వర్గాలు తెలిపాయి. రీపోలింగ్ అవసరం ఎక్కడా ఏర్పడలేదని స్పష్టం చేశాయి. అయితే నిజామాబాద్‌లో బీజేపీ ఎంపీ ధర్మపురి అరవింద్, సంగారెడ్డిలో కాంగ్రెస్ మాజీ ఎమ్మెల్యే జగ్గారెడ్డి పోలీసులతో అనుచితంగా ప్రవర్తించిన ఘటనలపై రాష్ట్ర ఎన్నికల కమిషనర్ రాణి కుముదిని సంబంధిత ఎస్పీల నుంచి నివేదికలు కోరినట్లు సమాచారం.

**కంట్రోల్ రూమ్ నుంచి పర్యవేక్షణ**


ఎస్ఈసీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన కంట్రోల్ రూమ్ ద్వారా పోలింగ్ సరళిని నిశితంగా పరిశీలించారు. కమిషనర్ రాణి కుముదిని, డీజీపీ శివధర్‌రెడ్డి, ఇతర ఉన్నతాధికారులతో కలిసి వెబ్‌కాస్టింగ్ ద్వారా సున్నిత కేంద్రాల పరిస్థితులను సమీక్షించారు. రూట్ మొబైల్ ఫోర్స్,



స్ట్రైకింగ్ ఫోర్స్, ప్రత్యేక బృందాల కదలికలను గూగుల్ మ్యాపింగ్‌తో అనుసంధానం చేసి రియల్‌టైమ్‌లో పర్యవేక్షించారు. జనరల్, మైక్రో అబ్జర్వర్లు పోలింగ్ కేంద్రాలను సందర్శించి ఎప్పటికప్పుడు నివేదికలు సమర్పించారు. కొన్నిచోట్ల సౌకర్యాల లోపంపై ఫిర్యాదులు వచ్చినప్పటికీ, సమయానికి పరిష్కరించినట్లు అధికారులు తెలిపారు. పోలింగ్ ముగిసిన

(మిగతా 2వ పేజీలో)





# 3 కార్పొరేషన్లుగా హైదరాబాద్ విభజన

జీహెచ్ఎంసీ, సైబరాబాద్, మల్కాజిగిరిగా పునర్వ్యవస్థీకరణ

పరిపాలన సౌలభ్యం, ప్రజాసేవల మెరుగుదలే లక్ష్యంగా ప్రభుత్వం నిర్ణయం

3 కార్పొరేషన్లకు స్పెషల్ ఆఫీసర్‌గా జయేశ్‌రంజన్ నియామకం

కమిషనర్లుగా కర్ణన్, వినయ్‌కృష్ణారెడ్డి, జి.సృజన బాధ్యతలు

వెంటనే అమల్లోకి.. గెజిట్‌కు చర్యలు.. 3 వెబ్‌సైట్లు.. త్వరలో 'టీ క్యూర్' యాప్

హైదరాబాద్: గ్రేటర్ హైదరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ రూపురేఖలు పూర్తిగా మారాయి. ఇటీవల 150 నుంచి 300 వార్డులకు విస్తరించిన జీహెచ్ఎంసీని ప్రభుత్వం మూడు కార్పొరేషన్లుగా విభజించింది. జీహెచ్ఎంసీ, సైబరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్, మల్కాజిగిరి మున్సిపల్ కార్పొరేషన్‌లుగా పునర్వ్యవస్థీకరిస్తూ బుధవారం అధికారిక ఉత్తర్వులు జారీ చేసింది. ఓఆర్ఆర్ లోపలి ప్రాంతాన్ని కవర్ చేసే తెలంగాణ కోర్ అర్బన్ రీజియన్ (టీ క్యూర్) పరిధిలో ప్రస్తుతం 12 జోన్లు, 60 సర్కిళ్లు, 300 వార్డులతో ఉన్న వ్యవస్థను మూడు భాగాలుగా విభజించినట్లు ప్రభుత్వం స్పష్టం చేసింది. ఏ కార్పొరేషన్ పరిధిలో ఏయే జోన్లు ఉంటాయన్న వివరాలను ఉత్తర్వుల్లో పేర్కొంది. జీహెచ్ఎంసీ చట్టం ప్రకారమే ఈ మూడు కార్పొరేషన్లను ఏర్పాటు చేసినట్లు ప్రభుత్వం తెలిపింది. ప్రతి కార్పొరేషన్ స్వతంత్ర సంస్థగా పనిచేస్తుందని పేర్కొంది. ఈ ఉత్తర్వులు తక్షణమే అమల్లోకి వస్తాయని

(మిగతా 2వ పేజీలో)



# పుర ఎన్నికల్లోల 'హస్తం'దే హవా

ఏఐసీసీ చీఫ్ ఖర్గేతో సీఎం రేవంత్ భేటీ

70% పైగా సీట్లు గెలుస్తామని ధీమా

చైర్మన్ పీఠాల్లో బీసీలు, మహిళలకు అగ్రతాంబూలం

నేడు కేంద్ర మంత్రులతో సీఎం కీలక భేటీలు

న్యూఢిల్లీ: రాష్ట్రంలో జరిగిన మున్సిపల్ ఎన్నికల్లో పార్టీ సత్తా చాటుతుందని, మెజారిటీ స్థానాలను కైవసం చేసుకుంటామని ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గేకు సీఎం రేవంత్‌రెడ్డి వివరించారు. దీంతో ఇదే ఊపుతో జెడ్పీటీసీ, ఎంపీటీసీ ఎన్నికల్లోనూ ముందుకెళ్లాలని ఖర్గే చెప్పారు. బుధవారం ఢిల్లీ వచ్చిన ఆయన నేరుగా తుగ్లక్ రోడ్డులోని అధికార నివాసానికి చేరుకున్నారు. సాయంత్రం 7 గంటల సమయంలో రాజాజీ మార్గ్‌లోని ఖర్గే నివాసంలో ఆయనతో మర్యాదపూర్వకంగా భేటీ అయ్యారు. సీఎం వెంట ఎంపీలు మల్లు రవి, అనిల్‌కుమార్ యాదవ్ ఉన్నారు. రాష్ట్రంలోని తాజా రాజకీయ పరిస్థితులు, మున్సిపల్ ఎన్నికలు, విజయావకాశాలపై సుమారు 30 నిమిషాల పాటు నేతలు చర్చించారు. సంక్షేమ పథకాలే గెలుపు గుర్రాలు ప్రభుత్వం అమలు చేస్తున్న ఆరు గ్యారెంటీలు, రైతు రుణమాఫీ వంటి అంశాలు ప్రజల్లోకి బలంగా వెళ్లాయని, మున్సిపల్ ఎన్నికల్లో ఈ అంశాలు పార్టీకి కలిసివస్తాయని రేవంత్ వివరించారు. 70 శాతానికిపైగా స్థానాల్లో విజయం సాధిస్తామని, మెజారిటీ మున్సిపాలిటీలు, కార్పొరేషన్లను కైవసం చేసుకుంటామని చెప్పారు. గెలిచిన మున్సిపాలిటీల్లో చైర్మన్, వైస్ చైర్మన్ల పదవుల్లో బీసీ సామాజిక వర్గం, మహిళలకే ఎక్కువ ప్రాధాన్యత ఇచ్చేలా చర్యలు తీసుకోనున్నట్లు తెలిపారు. జెడ్పీటీసీ, ఎంపీటీసీ ఎన్నికల నిర్వహణపై కూడా ఖర్గే, రేవంత్ చర్చించినట్లు సమాచారం. జెడ్పీటీసీ, ఎంపీటీసీ ఎన్నికలపై మంత్రివర్గంలో చర్చించి నిర్ణయం తీసుకుంటామని సీఎం చెప్పినట్లు సమాచారం. ఈ సందర్భంగా కొద్దిసేపు ఖర్గే, రేవంత్‌రెడ్డి ప్రత్యేకంగా సమావేశం అయినట్లు తెలిసింది. బీఆర్ఎస్, బీజేపీ పట్ల అప్రమత్తంగా ఉండండి ఇటీవల రాజకీయ, పాలనా పరమైన అంశాలు బయటకు రావడంపై ఇద్దరు నేతల మధ్య చర్చ జరిగినట్లు తెలిసింది. పార్టీ యంత్రాంగం, ప్రభుత్వం మధ్య సమన్వయం

(మిగతా 2వ పేజీలో)

## దేశాన్ని అమెరికాకు తాకట్టు పెట్టారు
## పార్లమెంట్‌లో మోదీపై రాహుల్ నిప్పులు

ఒప్పందం పేరుతో అమెరికాకు మోదీ పూర్తిగా లొంగిపోయారని విమర్శ.

వ్యవసాయ రంగాన్ని అగ్రరాజ్యానికి బార్లా తెరిచి రైతును ముంచేశారని ధ్వజం.

ఎప్‌స్టీన్ ఫైల్స్, అదానీ కేసు ఒత్తిళ్ల వల్లే దేశ ప్రయోజనాలు పణంగా పెట్టారని ఆరోపణ.



## దేశాన్ని అమ్మింది కాంగ్రెస్సే
## రాహుల్ విమర్శలను తిప్పికొట్టిన నిర్మల



డబ్ల్యూటీఓకు రైతుల ప్రయోజనాలను తాకట్టు పెట్టింది కాంగ్రెస్సేనని విమర్శ.

రూ.53.47 లక్షల కోట్ల వ్యయంతో ఆర్థిక క్రమశిక్షణ పాటిస్తున్నామని వెల్లడి.

# హైదరాబాద్‌లో వెయ్యి కోట్ల విలువైన భూములను కాపాడిన హైడ్రా

**హైదరాబాద్‌లో రూ.1,003 కోట్ల విలువైన ప్రభుత్వ భూములను కాపాడిన హైడ్రా**

**జూబ్లీహిల్స్‌లో రూ.3 కోట్ల విలువైన పార్కు స్థలం స్వాధీనం, అక్రమ నిర్మాణం కూల్చివేత**

**ఖానామెట్‌లో రూ.1,000 కోట్ల విలువైన 5 ఎకరాల భూమికి ఫెన్సింగ్ ఏర్పాటు**

**ప్రజావాణిలో వచ్చిన ఫిర్యాదులపై తక్షణమే స్పందించిన అధికారులు**

**కబ్జాదారులపై కేసులు నమోదు చేసి, భూములకు రక్షణ కల్పించిన హైడ్రా**



హైదరాబాద్ మహానగరంలో అత్యంత విలువైన ప్రభుత్వ భూములపై కన్నేసిన కబ్జాకోరులపై 'హైడ్రా' ఉక్కుపాదం మోపుతోంది. నగరంలోని అత్యంత ఖరీదైన ప్రాంతాలైన జూబ్లీహిల్స్, ఖానామెట్‌లలో జరిగిన రెండు వేర్వేరు కబ్జా యత్నాలను భగ్నం చేసింది. ఈ చర్యల ద్వారా సుమారు రూ. 1,003 కోట్ల విలువైన ప్రభుత్వ ఆస్తులను కాపాడినట్లు అధికారులు తెలిపారు. హైడ్రా ప్రజావాణికి అందిన ఫిర్యాదుల మేరకు కమిషనర్ ఏవీ రంగనాథ్ ఆదేశాలతో అధికారులు బుధవారం ఈ చర్యలు చేపట్టారు. జూబ్లీహిల్స్‌లోని అపోలో ఆసుపత్రి ఔట్ గేట్‌కు ఎదురుగా ఉన్న దాదాపు 2 ఎకరాల పార్కు స్థలాన్ని ఓ వ్యక్తి ఆక్రమించుకునే ప్రయత్నం చేశాడు. అక్కడ ఓ ఇంటిని అద్దెకు తీసుకుని లేడీస్ హాస్టల్ నడుపుతున్న సదరు వ్యక్తి, పార్కుకు చెందిన 150 గజాల స్థలంపై కన్నేశాడు. సుమారు 50 గజాల మేర పార్కులోకి చొచ్చుకెళ్లి పాత భవనానికి ఆనుకుని మూడు అంతస్తుల అక్రమ నిర్మాణం చేపట్టాడు. మరో 100 గజాల స్థలాన్ని తన సొంత పార్కుగా మార్చుకుని ఫార్మ్ హౌస్ తరహాలో వాడుకుంటున్నాడు. దీనిపై స్థానికులు అభ్యంతరం వ్యక్తం చేస్తూ హైడ్రా ప్రజావాణిలో ఫిర్యాదు చేశారు. హైడ్రా కమిషనర్ ఏవీ రంగనాథ్ ఆదేశాలతో జీహెచ్ఎంసీ అధికారులతో కలిసి హైడ్రా బృందాలు క్షేత్రస్థాయిలో పరిశీలన జరిపాయి. కబ్జా నిజమేనని నిర్ధారించుకుని బుధవారం మూడు అంతస్తుల అక్రమ నిర్మాణాన్ని కూల్చివేశారు. సుమారు రూ.3 కోట్ల విలువైన ఆ పార్కు స్థలానికి ఫెన్సింగ్ వేసి రక్షణ కల్పించారు. కబ్జాకు పాల్పడిన వ్యక్తిపై పోలీసు స్టేషన్‌లో కేసు నమోదు చేశారు. మరో ఘటనలో, హైటెక్స్ ఎగ్జిబిషన్ గ్రౌండ్స్ సమీపంలోని ఖానామెట్‌లో ఉన్న 5 ఎకరాల ప్రభుత్వ భూమిని హైడ్రా కాపాడింది. గతంలో ఈ భూమిని ప్రభుత్వం ఆల్ ఇండియా

(మిగతా 2వ పేజీలో)

# 3 కార్పొరేషన్లుగా హైదరాబాద్ విభజన

ప్రభుత్వ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి జయేశ్‌రంజన్ విడుదల చేసిన జీవో నంబర్55లో స్పష్టం చేశారు. గెజిట్ నోటిఫికేషన్‌కు అవసరమైన చర్యలు తీసుకోవాలని జీహెచ్‌ఎంసీ కమిషనర్‌కు ఆదేశాలు జారీ చేశారు.

**జయేశ్‌రంజన్‌కు పర్యవేక్షణ బాధ్యతలు**

మూడు కార్పొరేషన్ల కార్యకలాపాలను సమన్వయం చేయడానికి స్పెషల్ ఆఫీసర్‌గా జయేశ్‌రంజన్‌ను నియమిస్తూ ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె.రామకృష్ణారావు ఉత్తర్వులు జారీ చేశారు. బెంగళూరులో అనేక కార్పొరేషన్లకు ఒకే చీఫ్ కమిషనర్ ఉండే విధానం తరహాలో హైదరాబాద్‌లోనూ పర్యవేక్షణ వ్యవస్థను అమలు చేస్తున్నట్లు అధికారులు తెలిపారు.

**కమిషనర్లు బాధ్యతల స్వీకారం**

జీవోలు వెలువడిన వెంటనే బుధవారం ఉదయం నుంచే అధికార యంత్రాంగం కదిలింది. జీహెచ్‌ఎంసీ ప్రధాన కార్యాలయంలోని మేయర్ చాంబర్‌లో స్పెషల్ ఆఫీసర్‌గా జయేశ్‌రంజన్ బాధ్యతలు చేపట్టారు. మల్కాజిగిరి కార్పొరేషన్ కార్యాలయం (తార్నాక)లో టి.వినయ్‌కృష్ణారెడ్డి, న్యాక్‌లోని సైబరాబాద్ కార్పొరేషన్ కార్యాలయంలో జి.సృజన కమిషనర్లుగా బాధ్యతలు స్వీకరించారు. పరిధి మారడంతో ఆర్‌వీ కర్ణన్ మళ్లీ జీహెచ్‌ఎంసీ కమిషనర్‌గా తన చాంబర్‌లోనే బాధ్యతలు చేపట్టారు. బదిలీ అయిన సిబ్బంది ఆయా కార్యాలయాల్లో విధుల్లో చేరారు.



**డిజిటల్ సేవల్లో కొత్త మార్పులు**

మూడు కార్పొరేషన్లకు వేర్వేరుగా వెబ్‌సైట్లను సిద్ధం చేశారు. ప్రజా ఫిర్యాదుల కోసం ప్రస్తుతం ఉపయోగంలో ఉన్న 'మై జీహెచ్‌ఎంసీ యాప్'కు బదులుగా త్వరలో 'టీ క్యూర్' యాప్‌ను అందుబాటులోకి తీసుకురానున్నారు.

# దేశాన్ని అమెరికాకు తాకట్టు పెట్టారు
# పార్లమెంట్‌లో మోదీపై రాహుల్ నిప్పులు

**ఒప్పందం పేరుతో అమెరికాకు మోదీ పూర్తిగా లొంగిపోయారని విమర్శ.**

**వ్యవసాయ రంగాన్ని అగ్రరాజ్యానికి బార్లా తెరిచి రైతును ముంచేశారని ధ్వజం.**

**ఎప్‌స్టీన్ ఫైల్స్, అదానీ కేసు ఒత్తిళ్ల వల్లే దేశ ప్రయోజనాలు పణంగా పెట్టారని ఆరోపణ.**

**అమెరికా పన్నులు పెంచుతుంటే, భారత్ సున్నాకు తగ్గించడం సిగ్గుచేటని మండిపాటు.**



న్యూఢిల్లీ: అమెరికాతో వాణిజ్య ఒప్పందంపై మోదీ సర్కారును విపక్ష నేత రాహుల్‌గాంధీ తీవ్రస్థాయిలో దుయ్యబట్టారు. ఒప్పందం పేరిట మన తల్లి భరతమాతనే అమెరికాకు అమ్మేశారంటూ నిప్పులు చెరిగారు. "వ్యవసాయం, ఇంధనంతో సహా అన్ని రంగాలనూ అమెరికా చేతికి అప్పగించేశారు. ఆ దేశానికి పూర్తిస్థాయి లొంగిపోయారు. దేశాన్ని ఇలా అడ్డంగా అమ్మేసినందుకు మీకు కనీసం సిగ్గుగా అనిపించడం లేదా?"అంటూ కేంద్రంపై విరుచుకుపడ్డారు. బుధవారం లోక్‌సభలో కేంద్ర బడ్జెట్‌పై చర్చలో రాహుల్ ప్రసంగించారు. అమెరికాతో ఏకపక్ష ఒప్పందాన్ని మోదీ సర్కారు ఎలా సమర్థించుకుంటుందని ప్రశ్నించారు. "పలు విషయాలకు సంబంధించి ప్రధాని నరేంద్ర మోదీపై అమెరికా నేరుగా విపరీతమైన ఒత్తిడి పెట్టింది. పూర్తిగా ఆయన మెడలు వంచి నొక్కిపట్టింది. అందుకే దేశాన్ని మోదీ అమెరికాకు అమ్మేశారు. కేవలం అధికారం కాపాడుకోవడానికి జాతీయ ప్రయోజనాలను పణంగా పెట్టారు. లేదంటే ఇలాంటి ఏకపక్ష ఒప్పందానికి ఆయనే కాదు, ఏ భారత ప్రధానీ అంగీకరించబోడు"అంటూ తీవ్ర ఆరోపణలు చేశారు. "మార్షల్ ఆర్ట్స్‌లో ప్రత్యర్థి మెడను దొరకబుచ్చుకున్నాక దాన్ని గట్టిగా నొక్కిపడతారు. దాంతో అతను అల్లాడిపోతాడు. లొంగిపోయానంటూ చేతులెత్తేస్తాడు. మోదీ చేసింది సరిగ్గా అదే"అంటూ ఎద్దేవా చేశారు. "వాణిజ్య ఒప్పందం ద్వారా మన రైతుల ప్రయోజనాల విషయంలో కేంద్రం పూర్తిగా రాజీ పడింది. జౌళి రంగాన్ని నేలమట్టం చేశారు. మన డేటాను, రైతులను, సాఫ్ట్‌వేర్ ఇంజనీర్లను, మన శక్తియుక్తులను, చిన్న, మధ్యతరహా వ్యాపారాలనూ అమ్మేశారు. ఇంధన భద్రతను గాలికొదిలేశారు. ఇకపై మనం ఎవరి నుంచి చమురు కొనుగోలు చేయాలో నిర్ణయించేది అమెరికాయే తప్ప మన ప్రధాని కాదు! పైగా ఆ కొనుగోళ్లను అగ్ర రాజ్యమే నిత్యం పర్యవేక్షిస్తుంటుంది. వారు చెప్పిన వాళ్ల దగ్గర కొనకపోతే మనపై మళ్లీ 50 శాతం టారిఫ్‌లు బాదుతారు. మన ఆర్థిక, ఇంధన రంగాలను మనపైకే ఆయుధాలుగా గురి పెట్టేందుకు అమెరికాను కేంద్రం అనుమతించింది"అంటూ నిప్పులు చెరిగారు. బీజేపీ ప్రయోజనాల కోసమే... వాణిజ్య ఒప్పందం పేరుతో మోదీ సర్కారు అమెరికాకు దాసోహమన్న తీరు చాలా విషాదకరమని రాహుల్ అన్నారు. "మోదీ కేవలం తాను మాత్రమే లొంగిపోలేదు. 150 కోట్ల మంది భారతీయుల భవిష్యత్తునే అమెరికాకు అప్పగించేశారు. అధికార బీజేపీ ఆర్థిక ఆయువుపట్లలో ఒకరిపై అమెరికాలో కేసు నడుస్తుండటమే ఇందుకు కారణం. సొంత పార్టీ ఆర్థిక ప్రయోజనాలను కాపాడుకోవడానికే దేశాన్ని అగ్ర రాజ్యానికి మోదీ అమ్మకం పెట్టారు"అంటూ రాహుల్ తీవ్ర ఆరోపణలు చేశారు. "డిజిటల్ వాణిజ్య నిబంధనలపై నియంత్రణను కేంద్రం పూర్తిగా అమెరికాకు వదిలేసుకుంది. డేటా లోకలైజేషన్‌ను తొలగించేసింది. అమెరికా నుంచి డేటా వరదకు గేట్లెత్తేందుకు ఒప్పుకుంది. బడా టెక్ కంపెనీలకు 20 ఏళ్ల ట్యాక్స్ హాలిడేలు ప్రకటించేసింది. మొదట్లో మనపై కేవలం 3 శాతంగా ఉండే అమెరికా టారిఫ్‌లు ఇప్పుడు 18 శాతానికి పెరిగాయి. అమెరికా వస్తూత్పత్తులపై భారత టారిఫ్‌లు మాత్రం 16 శాతం నుంచి ఎకాయెకి సున్నాకు పడిపోయాయి. అమెరికా దిగుమతులు 46 బిలియన్ డాలర్ల నుంచి ఏకంగా 146 బిలియన్ డాలర్లకు పెరగనున్నాయి"అంటూ రాహుల్ మండిపడ్డారు. "కేంద్రం మన వ్యవసాయ రంగాన్ని అమెరికాకు బార్లా తెరిచేసింది. దాంతో అక్కడి వ్యవసాయోత్పత్తులు మన మార్కెట్లను ముంచెత్తనున్నాయి. దేశ చరిత్రలోనే తొలిసారిగా మన రైతులు భారీ సంక్షోభాన్ని ఎదుర్కోనున్నారు. మోదీకి ముందు ఏ ప్రధానీ ఇలాంటి సిగ్గుచేటైన పని చేయలేదు. ఇకముందు మరే ప్రధానీ చేయబోడు"అన్నారు. అధికార పక్ష సభ్యులు పదేపదే లేచి రాహుల్ ప్రసంగానికి అడ్డుతగిలారు. ఆయన నిరాధార ఆరోపణలు చేస్తున్నారంటూ దుయ్యబట్టారు. చేతనైతే వాటికి రుజువులు చూపాలని సవాలు చేయగా అందుకు తాను సిద్ధమేనని రాహుల్ బదులిచ్చారు. మేమైతే ఇలా చేసేవాళ్లం "యుద్ధాల శకం ముగిసిందని మోదీ అంటున్నారు. కానీ నిజానికి మనమున్నదే యుద్ధాల శకంలో! ఇలాంటప్పుడు మన బలాలేమిటో అవగాహన ఉండాలి. ప్రజలే మన నిజమైన బలం"అని రాహుల్ అన్నారు. "ఇండియా కూటమే గనుక అధికారంలో ఉంటే వాణిజ్య ఒప్పందం విషయంలో పూర్తిగా భిన్నంగా వ్యవహరించేది. డేటా మన అతి పెద్ద ఆస్తి. అది అమెరికాకు అందుబాటు ఉండాలంటే భారత్‌ను అమెరికా సేవకునిలా గాక సమాన భాగస్వామిగా పరిగణించాలని ట్రంప్‌కు కుండబద్దలు కొట్టేవాళ్లం. ఆ హోదాలోనే చర్చలు జరిపేవాళ్లం. దేశ ఇంధన భద్రతపై, మన రైతుల ప్రయోజనాలపై రాజీ పడే ప్రసక్తే లేదని, వాటిపై చర్చలకు తావు లేదని ఆయన ముఖం మీదే చెప్పేవాళ్లం. పాక్ ఆర్మీ చీఫ్‌తో ట్రంప్ అల్పాహార భేటీ వంటి ఉదంతాలపై కచ్చితంగా అభ్యంతరం వ్యక్తం చేసేవాళ్లం"అని చెప్పుకొచ్చారు. ఎప్‌స్టీన్ ఫైల్స్‌లో అంబానీ, పురీ అమెరికాతో పాటు పలు దేశాల్లో సంచలనం సృష్టిస్తున్న ఎప్‌స్టీన్ సెక్స్ కుంభకోణం టేపుల్లో కేంద్ర మంత్రి హర్దీప్‌సింగ్ పురీ, వ్యాపారవేత్త అనిల్ అంబానీ పేర్లు కూడా ఉన్నాయని రాహుల్ ఆరోపించారు. బుధవారం సాయంత్రం పార్లమెంటు ప్రాంగణంలో ఆయన మీడియాతో మాట్లాడారు.

# దేశాన్ని అమ్మింది కాంగ్రెస్సే: రాహుల్ విమర్శలను తిప్పికొట్టిన నిర్మల

**డబ్ల్యూటీఓకు రైతుల ప్రయోజనాలను తాకట్టు పెట్టింది కాంగ్రెస్సేనని విమర్శ.**

**రూ.53.47 లక్షల కోట్ల వ్యయంతో ఆర్థిక క్రమశిక్షణ పాటిస్తున్నామని వెల్లడి.**

**జీఎస్టీపై స్పష్టత: పాలు, విద్య, అంతిమక్రియలపై పన్ను వేయలేదని టీఎంసీకి కౌంటర్.**

**శాంతిభద్రతలు: పశ్చిమ బెంగాల్‌లో చట్టం కాకుండా బాంబులే మాట్లాడుతున్నాయని ఎద్దేవా**




న్యూఢిల్లీ: వాణిజ్య ఒప్పందం పేరిట దేశాన్ని మోదీ సర్కారు అమెరికాకు అమ్మేసిందన్న విపక్ష నేత రాహుల్‌గాంధీ వ్యాఖ్యలపై కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ మండిపడ్డారు. "దేశ ప్రయోజనాలను ప్రపంచ వాణిజ్య సంస్థ (డబ్ల్యూటీఓ) వంటి అంతర్జాతీయ సంస్థలకు తాకట్టు పెట్టింది కాంగ్రెస్ సారథ్యంలోని యూపీఏ ప్రభుత్వమే. పేదలు, రైతుల ప్రయోజనాలను వాటికి అమ్మేసింది. ఏకంగా దేశాన్నే అమ్మేసింది"అంటూ దుయ్యబట్టారు. కేంద్రంలో అధికారంలో ఉండగా షెర్మెల్ షేక్ చర్చల సందర్భంగా దేశాన్ని దాయాది పాకిస్తాన్‌కు తనఖా పెట్టిన, ఏకంగా మన సార్వొకమత్వం విషయంలో రాజీ పడ్డ చరిత్ర కూడా కాంగ్రెస్‌దేనని ఎద్దేవా చేశారు. కేంద్ర బడ్జెట్ 202627పై లోక్‌సభలో జరిగిన చర్చకు నిర్మల బుధవారం సాయంత్రం బదులిచ్చారు. మన దేశాన్ని అమ్మగల, కొనగల వాడెవరూ పుట్టలేదంటూ పార్లమెంటరీ వ్యవహారాల మంత్రి కిరెణ్ రిజిజు చేసిన వ్యాఖ్యలను ఆమె పునరుద్ఘాటించారు. ప్రధాని నరేంద్ర మోదీ అలాంటి పని ఎప్పటికీ చేయబోరని స్పష్టం చేశారు. ఇంధన, ఆర్థిక, ఆహార, డేటా భద్రత తదితరాలపై రాహుల్ లేవనెత్తిన ఆందోళనలను కొట్టిపారేశారు. ఆ విషయాల్లో అవసరమైన అన్ని చర్యలూ కేంద్రం తీసుకుందని, బడ్జెట్‌లో వాటికి చాలినన్ని నిధులు కేటాయించిందని చెప్పారు. సంబంధిత గణాంకాలను సభకు చదివి వినిపించారు. రాహుల్ అసలు బడ్జెట్‌నే చదవకుండా నిరాధార ఆరోపణలకు దిగారని మండిపడ్డారు. వచ్చే ఆర్థిక సంవత్సరంలో కేంద్ర ప్రభుత్వ వ్యయాన్ని రూ.53.47 లక్షల కోట్లుగా అంచనా వేసినట్టు నిర్మల సభకు తెలిపారు. "మా ప్రభుత్వం కఠినమైన ఆర్థిక క్రమశిక్షణ పాటిస్తోంది. 2027 ఆర్థిక సంవత్సరంలో ద్రవ్య లోటు 4.3 శాతానికి పరిమితం కావచ్చు"అని అంచనా వేశారు. దేశంలో ఎరువుల కొరత ఉందన్న వార్తలను కొట్టిపారేశారు. వాటి దిగుమతికి బడ్జెట్లో ఏకంగా రూ.1.71 లక్షల కోట్లు కేటాయించామని గుర్తు చేశారు. కేంద్ర బడ్జెట్లో పశ్చిమబెంగాల్‌కు కేటాయింపులే లేవన్న తృణమూల్ కాంగ్రెస్ పార్టీ ఆరోపణలను నిర్మల తీవ్రంగా ఖండించారు. ఆ పార్టీ ఏలుబడిలో రాష్ట్రంలో శాంతిభద్రతలు పూర్తిగా మంటగలిశాయంటూ మమతా బెనర్జీ సర్కారు పనితీరును దుయ్యబట్టారు. బెంగాల్లో ఎక్కడ చూసినా బాంబుల సంస్కృతే రాజ్యమేలుతోందని ఆరోపించారు. 'బెంగాల్లో బాంబులే మాట్లాడతాయి, చట్టాలు కాదు'అంటూ పలు ఉదంతాలను ఉటంకించారు. దాంతో విపక్ష సభ్యులు పెద్దపెట్టున నినదిస్తూ నిరసన వ్యక్తం చేశారు. పాలు, స్టేషనరీ, విద్యపై జీఎస్టీ వసూలు చేస్తున్నారన్న తృణమూల్ కాంగ్రెస్ సభ్యుడు అభిషేక్ బెనర్జీ చేసిన వ్యాఖ్యలను నిర్మల తీవ్రంగా ఖండించారు. "వాస్తవాలను ఆయన ఉద్దేశపూర్వకంగా పూర్తిగా వక్రీకరించారు. పెన్సిళ్లు, షార్పనర్లపైనా జీఎస్టీ వేశామట! మరీ ఈ స్థాయిలో అబద్ధాలా? 2017లో జీఎస్టీని ప్రవేశపెట్టిన నాటి నుంచీ పాలపై ఎన్నడూ జీఎస్టీ విధించలేదు. చావుపైనా జీఎస్టీ వేశారని పచ్చి అబద్ధాలు చెప్పారు. అంతిమక్రియలపై కూడా ఎప్పుడూ జీఎస్టీ లేదు. వింటున్న సభ్యులకు తెలివి లేదని అభిషేక్ భావిస్తున్నారా?"అంటూ ఆగ్రహం వెలిబుచ్చారు. బహుశా పశ్చిమబెంగాల్లో నడుస్తున్న సిండికేట్ మరణాలపైనా పన్నులు వసూలు చేస్తోందేమో అంటూ అధికార తృణమూల్‌ను ఉద్దేశించి ఎద్దేవా చేశారు. అన్యాయానికి గురయ్యామంటూ సానుభూతి కార్డు వాడటం, ప్రతిదానికీ సుప్రీంకోర్టు దగ్గరికి పరుగెత్తడం, చివరికి కోర్టుతో చీవాట్లు తినడం తృణమూల్‌కు అలవాటుగా మారిందన్నారు.

## నాతో కలిసి నడిచి మన అభ్యర్థుల గెలుపునకు కృషిచేసిన ప్రతి ఒక్కరికి ప్రత్యేక ధన్యవాదాలు

**::: బిఆర్ఎస్ జిల్లా నాయకులు డాక్టర్ ర్యాకల శ్రీనివాస్**



యాదాద్రి వార్త మిర్రర్ ప్రతినిధి : ప్రజల బాధ్యతాయుత కర్తవ్యం దీక్షతో, కార్యకర్తల. పార్టీ నాయకుల సహకారంతో, దేవుని దయతో ఈ ఓటింగ్ ప్రక్రియ ప్రశాంతంగా ముగిసింది. ఇన్నాళ్లు పార్టీ కోసం, మన అభ్యర్థుల గెలుపు కోసం ప్రతి విషయంలోనూ వెన్నంటి ఉంటూ బాధ్యతగా, నమ్మకంగా నాతో కలిసి నడిచిన మన అభ్యర్థులకు ఓటు వేసిన ప్రతి ఒక్కరికి పేరుపేరునా హృదయపూర్వక ధన్యవాదాలు




## తెలంగాణ రాష్ట్ర వికలాంగుల సమితి ఆధ్వర్యంలో మహాత్మా గాంధీ జాతీయ అవార్డ్స్ సినీ నటుడు శ్రీనివాస్ చేతుల మీదుగా అవార్డ్స్ అందుకున్న- సింగారం రమేష్

యాదాద్రి వార్త మిర్రర్ ప్రతినిధి : తెలంగాణ రాష్ట్ర వికలాంగుల సమితి ఆధ్వర్యంలో రవీంద్ర భారతిలో జరిగిన మహాత్మా గాంధీ జాతీయ అవార్డ్స్ కి ఎంపికైన వారికి అవార్డ్స్ పంపిణీలో ప్రముఖ సినీ నటుడు శ్రీనివాస్ చేతుల మీదుగా అవార్డ్స్ అందుకున్న యాదాద్రి భువనగిరి జిల్లా వికలాంగుల హెల్పింగ్ సొసైటీ అధ్యక్షులు సింగారం రమేష్ వారు ఈ సందర్భంగా మాట్లాడుతూ నన్ను అవార్డ్స్ కు ఎంపిక చేసిన వికలాంగుల సమితికి ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు





## మాజీ ఎంపీ మధు యాష్కికి గౌడ్ ను మర్యాదపూర్వకంగా కలిసిన బీసీ నేత గుండగోని మధు గౌడ్

**బీసీ లకు 42% రిజర్వేషన్ అమలయ్యేలా ప్రభుత్వం తో చర్చించాలి!**

ఎల్ బి నగర్ వార్త మిర్రర్ ప్రతినిధి : ఎల్ బి నగర్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇన్చార్జ్, తెలంగాణ ఎన్నికల కమిటీ చైర్మన్ మధు యాష్కి గౌడ్ నివాసంలో మర్యాదపూర్వకంగా కలిసిన తెలంగాణ బీసీ విద్యార్థి, యువజన సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గుండగోని మధు గౌడ్ ఈ సందర్భంగా వారితో మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం కామారెడ్డిలో ఇచ్చిన డిక్లరేషన్ ప్రకారం బీసీ రిజర్వేషన్లను అమలు చేయాలని, మీరు ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్లాలని వారితో తెలిపారు. పార్టీపరంగా గ్రామపంచాయతీ, మున్సిపాలిటీ ఎన్నికల్లో బీసీలకు సీట్లు అధికంగా కేటాయించిన, రాబోయే ఎంపీటీసీ, జడ్పిటిసి ఎన్నికల్లో బీసీలకు 42% రిజర్వేషన్లు ప్రభుత్వపరంగా అమలయ్యేలా ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్లాలని తెలిపారు. ఈ విషయానికి మధు యాష్కి గౌడ్ సనుకూలంగా స్పందిస్తూ సీఎం రేవంత్ రెడ్డి, రాష్ట్ర మంత్రులతో చర్చిస్తానని అమలు అయ్యేలా ప్రయత్నిస్తానని తెలిపారు

## నేడు భారత్ బంద్..
## బ్యాంకింగ్, రవాణా సేవలకు అంతరాయం!

కేంద్ర ప్రభుత్వ విధానాలకు వ్యతిరేకంగా పదికి పైగా కార్మిక, రైతు సంఘాలు గురువారం (ఫిబ్రవరి 12) 'భారత్ బంద్'కు పిలుపునిచ్చాయి. కేంద్రం అనుసరిస్తున్న కార్మిక, రైతు వ్యతిరేక, కార్పొరేట్ అనుకూల విధానాలను నిరసిస్తూ ఈ దేశవ్యాప్త సమ్మె నిర్వహిస్తున్నట్లు కార్మిక సంఘాల ఉమ్మడి వేదిక ప్రకటించింది. ఈ సమ్మెలో సుమారు 30 కోట్ల మంది కార్మికులు పాల్గొంటారని అంచనా వేస్తున్నారు. ఈ బంద్‌కు సంయుక్త కిసాన్ మోర్చా (ఎస్‌కేఎం) కూడా సంపూర్ణ మద్దతు ప్రకటించడంతో దీని ప్రభావం దేశవ్యాప్తంగా పలు రంగాలపై పడనుంది. ముఖ్యంగా ప్రభుత్వ రంగ బ్యాంకులు, బీమా, రవాణా, విద్యుత్, బొగ్గు, గ్యాస్ వంటి కీలక రంగాల్లో సేవలకు అంతరాయం కలిగే అవకాశం ఉంది. ఏఐబీఈఏ, ఏఐబీవోఏ వంటి కొన్ని బ్యాంకు ఉద్యోగుల సంఘాలు సమ్మెలో పాల్గొంటున్నందున బ్యాంకింగ్ కార్యకలాపాలు పాక్షికంగా స్తంభించవచ్చు. కొత్త లేబర్ కోడ్‌లను రద్దు చేయాలని, బీమా రంగంలో 100 శాతం విదేశీ ప్రత్యక్ష పెట్టుబడులను (ఎఫ్‌డీఐ) అనుమతించడాన్ని వెనక్కి తీసుకోవాలని, ప్రైవేటీకరణను నిలిపివేయాలని కార్మిక సంఘాలు ప్రధానంగా డిమాండ్ చేస్తున్నాయి. ఏఐటీయూసీ ప్రధాన కార్యదర్శి అమర్‌జీత్ కౌర్ మాట్లాడుతూ ప్రభుత్వ విధానాలపై నిరసన వ్యక్తం చేసేందుకే ఈ సమ్మెకు పిలుపునిచ్చినట్లు స్పష్టం చేశారు. అయితే, ఆసుపత్రులు, అంబులెన్సులు, ఫార్మసీలు, పాలు వంటి అత్యవసర సేవలకు బంద్ నుంచి మినహాయింపు ఇచ్చారు. ప్రైవేటు కార్యాలయాలు, ఐటీ కంపెనీలు, పాఠశాలలు, కళాశాలలు యథావిధిగా పనిచేసే అవకాశం ఉన్నప్పటికీ, స్థానిక పరిస్థితులను బట్టి వాటి మార్పులు ఉండవచ్చని తెలుస్తోంది.

# తన హాయంలోనే వనస్థలిపురం డివిజన్ అన్ని రంగాలలో అభివృద్ధి చెందింది

**తాజా మాజీ కార్పొరేటర్ వెంకటేశ్వర్ రెడ్డి నివాసం ఉంటున్న కాలనీలో నేనే డ్రైనేజీ నిర్మించాను**

**మాజీ కార్పొరేటర్ జిట్టా రాజశేఖర్ రెడ్డి వెల్లడి**



ఎల్బీనగర్ 11 ఫిబ్రవరి వనస్థలిపురం డివిజన్ పరిధిలోని ప్రధాన సమస్యలను తాను పదవి కాలంలో ఉన్నప్పుడే 90 శాతం పరిష్కారం చేశానని, కానీ కాంగ్రెస్ తాజా మాజీ కార్పొరేటర్ వెంకటేశ్వర్ రెడ్డి డివిజన్ ను అన్ని విధాల తానే అభివృద్ధి చేశానని చెప్పుకోవడం డివిజన్ ప్రజలు గమనిస్తున్నారని మాజీ కార్పొరేటర్ చిట్టా రాజశేఖర్ రెడ్డి గుర్తు చేశారు. బుధవారం వనస్థలిపురంలోని తన కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో జిట్టా రాజశేఖర్ రెడ్డి మాట్లాడుతూ 5 సంవత్సరాల తన పదవీకాలం చివరి రోజు మంత్రిని డివిజన్ తీసుకొచ్చి అంగు ఆర్భాటాలు చేస్తూ డివిజన్ అంతా నేనే అభివృద్ధి చేశానని ప్రజలను అయోమయానికి చేస్తున్నాడని ఆరోపించారు. గత పదేళ్ల టిఆర్ఎస్ పార్టీ అధికారంలో ఉన్నప్పుడు తాను కార్పొరేటర్ గా ఉన్న సమయంతో పాటు ఎల్బీనగర్ ఎమ్మెల్యే సుధీర్ రెడ్డి సహకారంతో వనస్థలిపురం డివిజన్ అన్ని రంగాలలో పూర్తిగా అభివృద్ధి సాధించిందని రాజశేఖర్ రెడ్డి గుర్తు చేశారు. వనస్థలిపురం డివిజన్లో కోట్లాది రూపాయలు ఖర్చు చేసి తమ హాయంలో కట్టిన వాటర్ ట్యాంకులే తాను చేసిన అభివృద్ధికి నిదర్శనం అని తెలిపారు. డివిజన్ పరిధిలోని ప్రతి కాలనీలో మౌలిక వసతుల ఏర్పాటు కోసం కోట్లాది రూపాయల ఖర్చు చేయడంతో పాటు ప్రధాన సమస్యలను శాశ్వతంగా పరిష్కారం చేసిన ఘనత తమకే దక్కుతుందని జిట్టా ధీమా వ్యక్తం చేశారు. తాజా మాజీ కార్పొరేటర్ వెంకటేశ్వర్ రెడ్డి తన పట్ల వ్యక్తిగత విమర్శలు చేస్తున్నారని, ఇలాంటి విమర్శలు మానుకోకుంటే తగిన మూల్యం చెల్లించుకోవాల్సి వస్తుందని జిట్టా హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో డివిజన్ బి ఆర్ ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ లగ్గొని శ్రీధర్ గౌడ్, నాయకులు ఆనంద్ రాజు, మధు గౌడ్, రవి తదితరులు పాల్గొన్నారు.

# సైబరాబాద్ లో ప్రశాంతంగా మున్సిపల్ ఎన్నికలు.....





సైబరాబాద్ వార్త మిర్రర్ : సైబరాబాద్ పోలీస్ కమిషనరేట్ పరిధిలో మున్సిపల్ ఎన్నికల పోలింగ్ ప్రశాంతంగా ముగిశాయి. మున్సిపల్ ఎన్నికలు నేపథ్యంలో బందోబస్తును సైబరాబాద్ సీపీ డాక్టర్ ఎం. రమేష్, ఐపీఎస్., ఇతర అధికారులతో కలిసి బుధవారం పరిశీలించారు.సీపీ ముందుగా కుత్బుల్లాపూర్ జోన్ లోని మేడ్చల్ పోలీస్ స్టేషన్ పరిధి లోని ఎల్లంపేట మున్సిపాలిటీలోని రావెల్ కోల్ జెడ్పీహెచ్ స్కూల్, ఎల్లంపేట జెడ్పీహెచ్ స్కూల్లోని పోలింగ్ కేంద్రాల్లో పర్యటించారు. అనంతరం జీనోమ్ వ్యాలీ పోలీస్ స్టేషన్ పరిధి లోని అలియాబాద్ మున్సిపాలిటీలో ఉన్న లాల్ గడి మలక్ పేట్ జెడ్పీహెచ్ స్కూల్, అలియాబాద్ ఎంపీపీఎస్ పోలింగ్ కేంద్రాల వద్ద భద్రతా ఏర్పాట్లను పరిశీలించారు.అదేవిధంగా శేరిలింగంపల్లి జోన్ లోని పటాన్ చెరు పోలీస్ స్టేషన్ పరిధిలో ఉన్న ఇంద్రేశం, ఇస్నాపూర్ మున్సిపాలిటీలలోని ఇంద్రేశం ఎంపీయుపీ స్కూల్, ఇస్నాపూర్ జెడ్పీహెచ్ స్కూల్, చిట్కూల్ ఎంపీపీ స్కూల్ లోని పోలింగ్ కేంద్రాలను పరిశీలించారు. బందోబస్తు విధుల్లో ఉన్న పోలీసు సిబ్బందితో మాట్లాడి, భద్రతా పరంగా ఎలాంటి లోపాలు తలెత్తకుండా నిరంతరం అప్రమత్తంగా ఉండాలని, బాధ్యతాయుతంగా విధులు నిర్వహించాలని సూచించారు.ఈ సందర్భంగా సీపీ మాట్లాడుతూ.. ఎన్నికలు పూర్తిగా ప్రశాంత వాతావరణంలో స్వేచ్ఛాయుతంగా జరిగేలా అన్ని చర్యలు తీసుకున్నామని స్పష్టం చేశారు. ప్రజలు స్వేచ్ఛగా, ప్రశాంత వాతావరణంలో తమ ఓటు హక్కును వినియోగించుకోవాలన్నారు. అలాగే విధులు నిర్వహిస్తున్న పోలీస్ అధికారులు, సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని, ఎన్నికలు శాంతియుతంగా జరిగేలా కట్టుదిట్టమైన చర్యలు చేపట్టామని తెలిపారు. సైబరాబాద్ సీపీ వెంట డాక్టర్ ఎం. రమేష్, ఐపీఎస్., శేరిలింగంపల్లి డిసిపి సీ.హెచ్. శ్రీనివాస్, ఐపీఎస్., కుత్బుల్లాపూర్ ఇన్ ఛార్జ్ డిసిపి సాయి మనోహర్, ఎస్బీ డిసిపి సుధీంద్ర, క్రైమ్స్ డిసిపి ముత్యం రెడ్డి, డబ్ల్యు అండ్ ఎస్ డబ్ల్యూ డిసిపి సృజన కరణం, పీడీ సెల్ ఏడీసీపీ సత్యనారాయణ, కుత్బుల్లాపూర్ ఏడీసీపీ పురుషోత్తం, శేరిలింగంపల్లి ఏడీసీపీ ఉదయ్ రెడ్డి, కుత్బుల్లాపూర్ ఏసీపీ బాల గంగి రెడ్డి, మియాపూర్ ఏసీపీ శ్రీనివాస్ కుమార్, మేడ్చల్ ఏసీపీ శంకర్ రెడ్డి తదితరులు ఉన్నారు.

# అభం శుభం తెలియని బాలికపై అత్యాచారం చేసి హత్య చేసిన నిందితుడిని బహిరంగ ఉరితీయాలి

**ఎల్బీనగర్ లో సఖి మహిళా మండలి సోదరీమణుల నిరసన ప్రదర్శన**

**ఇలాంటి సంఘటనలపై భారత పార్లమెంట్ లో పబ్లిక్ లో ఉరి తీసే చట్టాలను తీసుకురావాలి**



ఎల్బీనగర్ 11 ఫిబ్రవరి ఎల్బీనగర్ చౌరస్తా అంబేడ్కర్ విగ్రహం వద్ద సఖీ సోదరిమణులు కొవ్వొత్తులతో భారీ ఎత్తున నిరసన ప్రదర్శన ప్రదర్శన చేశారు. బీహార్ రాష్ట్రంలో వికాస్ మహతోష్ అనే దుర్మార్గుడు అభం శుభం తెలియని చిన్నారిని అత్యాచారం చేసి హత్య చేసిన సంఘటన కు నిరసనగా హైదరాబాద్ సఖి సోదరిమణులు నిరసన కార్యక్రమాన్ని చేపట్టారు. భారతదేశంలో బాల బాలికలపై అత్యాచారాలు, మానభంగాలు, యాసిడ్ దాడులు, మహిళలపై అత్యాచారాలు, హత్యలు చేయడం వంటి దుర్మార్గమైన పనులు చేస్తున్న నరహంతకులను పబ్లిక్ లో ఉరితీయాలని హైదరాబాద్ సఖి మహిళా మండలి సభ్యులు డిమాండ్ చేశారు. భారత పార్లమెంట్ లో పబ్లిక్ లో ఉరి తీసే చట్టాలను తీసుకురావాలని, అందుకు అన్ని రాజకీయ పార్టీలు సహకరించాలని మహిళలపై మానభంగాలు,హత్యలు చేయాలన్నా గజగజ వనికి పోవాలని, అటువంటి బలమైన చట్టాలను పార్లమెంట్లో తీసుకురావాలని వారు డిమాండ్ చేశారు. భారతదేశంలో స్త్రీ ఒంటరిగా తిరిగే స్వాతంత్రం వీటికి రాలేదని, ఒంటరిగా వెళ్లిన మహిళ లేదా బాలిక తిరిగి వచ్చేదాకా నమ్మకము లేని దుర్మార్గపు పరిస్థితుల్లో మనం జీవిస్తున్నామని వారు ఆవేదన వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో సఖి మహిళా మండలి సోదరీమణులు కడారి అన్నపూర్ణ యాదవ్, ఎం. సంగీత, పట్నాల సావిత్రి, రజిత, లక్ష్మి, అనిశెట్టి లక్ష్మీ యాదవ్, బత్తుల వరలక్ష్మి యాదవ్, పిట్ట కడప రాణి, వనిత, అనసూయ, మంజుల, లక్ష్మి, పుణ్య తదితర సోదరీమణులు పాల్గొన్నారు.

# ఆధార్ కార్డు ఉపయోగించేవారికి అదిరిపోయే శుభవార్త.. నిమిషాల్లోనే అడ్రస్ అప్డేట్.. కొత్త యాప్‌లో ఇలా..




ఆధార్ కార్డులో వివరాలు

అప్‌డేట్ చేసుకోవడం ఇక మరింత ఈజీ. యూఐడీఏఐ కొత్త యాప్‌ను ప్రవేశపెట్టింది. ఈ యాప్ ద్వారా మొబైల్ నెంబర్‌తో పాటు అడ్రస్ వివరాలు సులవుగా నిమిషాల్లోనే అప్‌డేట్ చేసుకోవచ్చు. ఎలా అప్‌డేట్ చేసుకోవాలి అనే వివరాలు ఇందులో చూద్దాం.కేంద్ర ప్రభుత్వం కొత్త ఆధార్ యాప్‌ను తీసుకొచ్చిన విషయం తెలిసిందే. ఈ ఏడాది జనవరి చివరి వారంలో ఈ యాప్‌ను ప్రారంభించింది. ప్రస్తుతం గూగుల్ ప్లే స్టోర్, ఐఓఎస్ వెర్షన్లలో ఈ యాప్ అందుబాటులో ఉంది. ఆధార్ పేరుతో ఈ యాప్‌ను లాంచ్ చేశారు. ప్రస్తుతం ఆధార్‌లోని వివరాలు ఆన్‌లైన్‌లో అప్డేట్ చేసుకో వాలంటే యూఐడీఏఐ అధికారిక వెబ్‌సైట్ అందుబాటులో ఉంది. ఇక సమీపంలోని ఆధార్ సెంటర్లను సందర్శించి ఆఫ్‌లైన్ విధానంలో వివరాలు మార్చుకోవచ్చు. కానీ మొన్నటివరకు యాప్ అందుబాటులో లేకపోగా.. ఇప్పుడు ఆ సౌకర్యం కూడా యూఐడీఏఐ కల్పిస్తోంది. ఈ కొత్త యాప్ ద్వారా ఆధార్ అడ్రస్ ఎలా మార్చుకోవాలో చూద్దాం.అడ్రస్ మార్చుకోవడం ఈజీ-గూగుల్ ప్లే స్టోర్ ఓపెన్ చేయండి-ఆధార్ పేరుతో ఉండే యూఐడీఏఐ రూపొందించిన యాప్‌ను డౌన్‌లోడ్ చేసుకోండి-ఆధార్ నెంబర్, రిజిస్టర్డ్ మొబైల్ నెంబర్, ఇతర వివరాలను ఉపయోగించి యాప్‌లోకి లాగిన్ అవ్వండి-ఇక యాప్ ఓపెన్ చేయాడానికి ఎం-పిన్ లేదా ఫేస్ రికగ్నిషన్ సెటప్ చేసుకోండి-ఆ తర్వాత యాప్ మెయిన్ ఇంటర్‌ఫేస్ ఓపెన్ అవుతుంది-సేవలు అని కనిపించే ఆప్షన్‌ను ఎంచుకుండి-చిరుమానా అప్‌డేట్ ఆప్షన్ ఎంపిక చేయండి-అడ్రస్ అప్డేట్ చేసుకోవడానికి ఇంటి చిరునామా రుజునామా పత్రాన్ని అప్‌లోడ్ చేయండి-స్కాన్ చేసి అప్‌లోడ్ చేయవచ్చు.. లేదా ఫోల్డర్‌లో ఉండే అప్‌లోడ్ చేయవచ్చు-లేదా అదే చిరుమానాలో ఉన్న మీ కుటుంబసభ్యుల వివరాలు ఇవ్వండి-కొత్త అడ్రస్ వివరాలు ఎంటర్ చేయండి-ఆ తర్వాత ఫేస్ రికగ్నిషన్ ద్వారా మీ ముఖాన్ని ధృవీకరిం చండి- రూ.75 రుసుం డిజిటల్ పేమెంట్స్ ద్వారా చేయండి -ఆ తర్వాత యూఐడీఏఐ మీ వివరాలు వెరిఫై చేస్తుంది-వివరాలు కరెక్ట్ అని భావిస్తే అప్లికేషన్ ప్రాసీడ్ చేస్తుంది-కొత్త ఆధార్ కార్డు మీకు పోస్ట్ ద్వారా అందుతుంది-కొత్త ఆధార్ లో మీ అడ్రస్ అప్‌డేట్ చేసి ఉంటుంది-ఒకవేళ మీరు తప్పు గా వివరాలు అందిస్తే అప్లికేషన్ రిజెక్ట్ చేస్తారుసమయం ఆదా ప్రస్తుతం గ్రామాల్లో ఆధార్ సెంటర్లు అందుబాటులో లేవు. దీంతో ఆధార్‌లోని వివరాలు మార్చుకోవాలాంటే సమీపం లోని పట్టణానికి వెళ్లాల్సి వస్తుంది.

ఆధార్ సెంటర్ల వద్ద గంటల పాటు క్యూలైన్లలో నిల్చోవాల్సి ఉంటుంది. ఇక వికలాంగులు, గర్భిణీ స్త్రీలు, చిన్నపిల్లలు క్యూలైన్లలో నిల్చో వాలంటే కష్టతరమైన పని. ఇప్పటినుంచి మారుమూల ప్రాంతా ల్లో ఉండే ప్రజలు కూడా పట్టణాలకు వెళ్లాల్సిన పని లేదు. సులు వుగా మొబైల్ ఆధార్ వివరాలను అప్‌డేట్ చేసుకోవచ్చు.

## సీఎం కప్ రెండవ ఎడిషన్ వెయిట్ లిఫ్టర్స్ ఎంపిక పోటీలు

**ఈనెల 13న ఉదయం 10 గంటల నుంచి ఫిట్నెస్ 9 జిమ్ లో పోటీలు**



ఎల్బీనగర్ 11 ఫిబ్రవరి

సీఎం కప్ రెండవ ఎడిషన్ పోటీలలో భాగంగా ఈనెల 13న వెయిట్ లిఫ్టర్స్ ఎంపిక కార్యక్రమాన్ని దిల్సుఖ్ నగర్ లోని ఫిట్నెస్ 9 జిమ్ ఆవరణంలో నిర్వహిస్తున్నట్లు రంగారెడ్డి జిల్లా వెయిట్ లిఫ్టర్స్ అసోసియేషన్ రంగారెడ్డి జిల్లా అధ్యక్షులు బి. రవి ప్రకాష్ వెల్లడించారు. రంగారెడ్డి జిల్లా స్పోర్ట్స్ అథారిటీ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఈ ఎంపిక కార్యక్రమంలో ఔత్సాహికులైన వెయిట్ లిఫ్టర్లు పాల్గొనాలని ఆయన కోరారు. ఎంపికలో పాల్గొనాలనుకునే క్రీడాకారులు తమ పేర్లను ముందుగా వెబ్సైట్ లో రిజిస్టర్ చేసుకోవాలని ఆయన తెలిపారు. ఉదయం 10 గంటల వరకు ఫిట్నెస్ 9 జిమ్ వద్దకు తమ ఆధార్ కార్డు, ఆన్లైన్ రిజిస్టార్ పత్రాలు తీసుకొని రావాలని రవి ప్రకాష్ సూచించారు.

## మహాత్మాగాంధీ జాతీయ అవార్డుల కార్యక్రమంలో సేవా పురస్కారం అందుకున్న పి.నాగులు ..






శేరిలింగంపల్లి వార్త మిర్రర్ : హైదరాబాద్ నగరం రవీంద్రభారతిలో తెలంగాణ రాష్ట్ర వికలాంగుల సమితి ఆధ్వర్యంలో నిర్వహించిన మహాత్మాగాంధీ జాతీయ అవార్డు కార్యక్ర మంలో వికలాంగుల సంక్షేమ సంఘం రంగారెడ్డి జిల్లా ప్రెసిడెంట్ పి.నాగులు కి వారు వికలాంగుల సంక్షేమం కోసం నిరంతరం పని చేస్తున్న సందర్భంగా వారి విశిష్ట సేవలను గుర్తించి సేవా పురస్కారం ను సినీ గాయకుడు నల్గొండ గద్దర్ నరసన్న చేతుల మీదుగా అవార్డు, ప్రశంసా పత్రం లను అందజేశారు .ఈ కార్యక్రమంలో కమిటీ సభ్యులు, సినీ నటులు పసునూరి శ్రీనివాస్, పటాన్ చెరు పద్మశాలి సంఘం జనరల్ సెక్రటరీ, టి ఆర్ పి ఎస్ సంగారెడ్డి జాయింట్ సెక్రటరీ వై.వి రమణ తదితరులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

## ప్రాణాపాయంలో ఉన్న రజితను ఆదుకోండి దాతల కోసం ఎదురుచూపు!



వార్త మిర్రర్ రాయికల్ ప్రతినిధి ఫిబ్రవరి 11జగిత్యాల జిల్లా రాయికల్ మండలం సింగారావుపేట గ్రామానికి చెందిన మానేరు రజిత గత కొన్ని రోజులుగా పక్షవాతం (స్ట్రోక్) బారిన పడి తీవ్ర అనారోగ్యంతో బాధపడుతున్నారు. ప్రస్తుతం ఆమె హైదరాబాద్‌లోని సోమాజిగూడ యశోద హాస్పిటల్‌లో అత్యవసర చికిత్స పొందుతున్నారు. ?ఇప్పటివరకు కుటుంబ సభ్యులు సుమారు 5 లక్షల రూపాయలు ఖర్చు చేశారు. అవసరమైన మొత్తం, తదుపరి చికిత్స కోసం మరో 5 లక్షల రూపాయలు అవసరమవుతాయని వైద్యులు తెలిపారు. ?రెక్కాడితే గానీ డొక్కాడని సామాన్య కుటుంబం కావడంతో, అంత పెద్ద మొత్తం సమకూర్చుకోవడం భర్త సురేష్‌కు భారంగా మారింది. ??దాతలు, స్వచ్ఛంద సంస్థలు స్పందించి రజిత ప్రాణాలను కాపాడాలని ఆమె భర్త సురేష్ కన్నీళ్లతో వేడుకుంటున్నారు. మీ వంతు చిన్న సహాయం ఒక కుటుంబానికి కొండంత అండగా మారుతుంది. సహాయం చేయాలనుకునే వారు. సంప్రదించాల్సిన ఫోన్ నంబర్లు: 6305918539 9441835616




## పటిష్ట బందోబస్తు మధ్య స్ట్రాంగ్ రూమ్‌కు బ్యాలెట్ బాక్స్‌ల తరలింపు -

**జిల్లా ఎస్పీ అశోక్ కుమార్ ఐపీఎస్**


వార్త మిర్రర్ రాయికల్ ప్రతినిధి ఫిబ్రవరి 11జగిత్యాల జిల్లా వ్యాప్తంగా నిర్వహించిన మున్సిపల్ ఎన్నికల ఓటింగ్ ప్రక్రియ ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు లేకుండా పూర్తిగా ప్రశాంత వాతావరణంలో ముగిసిందని జిల్లా ఎస్పీ శ్రీ అశోక్ కుమార్ ఐపీఎస్ తెలిపారు. అన్ని పోలింగ్ కేంద్రాల నుండి బ్యాలెట్ బాక్స్‌లను పటిష్టమైన పోలీస్ బందోబస్తు మధ్య స్ట్రాంగ్ రూమ్‌కు తరలించినట్లు తెలిపారు. స్ట్రాంగ్ రూమ్ పరిసరాల్లో పోలీసు అధికారులు, సిబ్బందితో 24 గంటల పహారా ఏర్పాటు చేసి మల్టీ-లేయర్ భద్రతా వ్యవస్థ అమలు చేస్తున్నామని తెలిపారు. సీసీటీవీ కెమెరాల ద్వారా నిరంతర నిఘా కొనసాగుతోందని అన్నారు. జిల్లాలో ఎన్నికల ప్రక్రియ మొత్తం శాంతియుతంగా ముగియడంలో ప్రజలు, ఎన్నికల అధికారులు, పోలీస్ సిబ్బంది సమన్వయంతో పనిచేశారని ఎస్పీ ప్రశంసించారు. ప్రశాంతంగా ఓటింగ్ ప్రక్రియ ముగియడంలో కృషి చేసిన పోలీస్ సిబ్బందికి, అధికారులకు అభినందనలు తెలిపారు. అలాగే ప్రజలు అందించిన సహకారానికి కృతజ్ఞతలు తెలియజేస్తూ, ఓట్ల లెక్కింపు ప్రక్రియ కూడా ప్రశాంతంగా జరిగేలా అన్ని ఏర్పాట్లు చేసినట్లు పేర్కొన్నారు.



# మహిషాసురుడి కథ కరావళి

కన్నడ హీరో ప్రజ్వల్ దేవరాజ్ నటించిన తాజా చిత్రం 'కరావళి'. స్వీయ నిర్మాణ దర్శకత్వంలో గురుదత్త గనిగ తెరకెక్కించారు. త్వరలో విడుదలకానుంది. సోమవారం ఫస్ట్‌లుక్ ప్రోమోను విడుదల చేశారు. ఓ వైపు గేదె ప్రసవం, మరోవైపు హీరో జననం..ఈ రెండింటికి ఏదో సంబంధం ఉన్నట్లు చూపించడం..చివరకు హీరో మహిషాసురుడిగా మారినట్లు చూపించడం ఉత్కంఠను పంచింది. దర్శకుడు చిత్ర విశేషాలు తెలియజేస్తూ 'కరావళి అనే గ్రామంలో జరిగే కథ ఇది. మన భాష, సంస్కృతి మూలాల్లోంచి కథను తీసుకున్నాం. విజువల్స్, బ్యాక్‌గ్రౌండ్ స్కోర్ ప్రేక్షకులకు సరికొత్త అనుభూతిని పంచుతాయి. త్వరలోనే విడుదల తేదీని ప్రకటిస్తాం' అన్నారు. ఈ చిత్రానికి కెమెరా: అభిమన్యు సదానందన్, సంగీతం: సచిన్ బస్రూర్.

# గేమ్‌ఛేంజర్ వచ్చేది అప్పుడే?



రామ్‌చరణ్ 'గేమ్‌ఛేంజర్' విషయంలో కొత్త అప్‌డేట్ వచ్చింది. ఈ సినిమా ఎప్పుడు విడుదల అవుతుందా? అని ఆశగా ఎదురుచూస్తున్న అభిమానులకు ఇది నిజంగా చల్లని వార్తే. వచ్చే ఏడాది సమ్మర్‌లోపు ఈ చిత్రం షూటింగ్‌ను ముగించనున్నట్టు సమాచారం. దాదాపు 90శాతం ఇప్పటికే చిత్రీకరణ పూర్తయింది. ఇదిలావుంటే.. శంకర్ దర్శకత్వంలోనే కమల్‌హాసన్ నటిస్తున్న 'భారతీయుడు 2' కూడా పోస్ట్‌ప్రొడక్షన్ దశలో ఉంది. ఈ చిత్రాన్ని వచ్చే ఏడాది ఏప్రిల్‌లో విడుదల చేయడానికి నిర్మాతలు సన్నాహాలు చేస్తున్నారు. దీన్నిబట్టి ఒక రెండునెలలు అటుఇటుగా రెండు సినిమాలూ విడుదలయ్యే అవకాశం ఉందని సినీవర్గాల సమాచారం. ఇక రామ్‌చరణ్ 'గేమ్‌ఛేంజర్' సినిమా విషయానికొస్తే, సమకాలీన రాజకీయాలను ప్రశ్నిస్తూ, వ్యవస్థలోని లోపాలను ఎత్తిచూపుతూ శంకర్ తెరకెక్కిస్తున్న విప్లవాత్మక చిత్రంగా 'గేమ్‌ఛేంజర్'ని చెప్పొచ్చు. ఇందులో రామ్‌చరణ్ తండ్రీకొడుకులుగా ద్విపాత్రాభినయం చేస్తున్నారు. కైరా అద్వానీ, అంజలీ కథానాయికలు. ఇంకా శ్రీకాంత్, ఎస్.జె.సూర్య, సునీల్ తదితరులు కీలక పాత్రలు పోషించారు.

# పద్దెనిమిదేళ్ల విరామం తర్వాత



త్రిష అందంగా ఉంటుంది. తెరపై ఆమె యాటిట్యూడ్ మళ్లీ మళ్లీ చూడాలనిపించేలా ఉంటుంది. ఆ నవ్వు విప్పారిన పొద్దుతిరుగుడుపువ్వులా ఉంటుంది. మొన్నామధ్య వచ్చిన మణిరత్నం 'పొన్నియన్ సెల్వన్'లో చాలామంది హీరోయిన్లున్నా, అందంలో అందరికంటే ఒకమార్కు ఎక్కువ త్రిషకే పడిందని చెప్పడంలో ఏమాత్రం అతిశయోక్తి లేదు. అందుకే.. నేటికీ పెద్దపెద్ద సినిమాలు ఈ అందాన్నే వరిస్తున్నాయి. ఇటీవలే తమిళ విజయ్‌కి జోడీగా ఆమె నటించిన 'లియో' సినిమా విడుదలై మంచి వసూళ్లే రాబట్టింది. త్వరలో మరో భారీ సినిమాలో నటించనుంది త్రిష. అది కూడా తెలుగు సినిమా. అందునా మెగాస్టార్ సినిమా. అవును.. చిరంజీవి హీరోగా మల్లిడి వశిష్ఠ దర్శకత్వంలో తెరకెక్కుతున్న సోషియో ఫాంటసీ చిత్రం 'విశ్వంభర'లో త్రిష ప్రధాన కథానాయికగా ఎంపికైంది. అనుష్క, నయనతార, ఐశ్వర్యరాయ్ ఇలా చాలామంది హీరోయిన్ల పేర్లు ఈ పాత్ర విషయంలో వినిపించాయి. చివరకు త్రిష ఖరారైంది. 18ఏళ్ల క్రితం చిరంజీవితో 'స్టాలిన్' సినిమాలో నటించింది త్రిష. మళ్లీ ఇన్నాళ్లకు మెగాస్టార్‌తో జతకట్టనుంది. మెగా అభిమానులకు ఇది నిజంగా శుభవార్తే.



# బాలీవుడ్‌లో సత్తా చూపిస్తా

అగ్ర కథానాయిక కీర్తి సురేష్ ఏ పాత్రలోనైనా చక్కగా ఒదిగిపోతుంది. వాణిజ్య చిత్రాలతో పాటు మహిళా ప్రధాన కథాంశాల్లో కూడా తనదైన నటనతో మెప్పిస్తుంది. ఈ ఏడాది విడుదలైన 'దసరా' చిత్రంలో వెన్నెలగా అద్భుతాభినయంతో మెప్పించింది. తాజాగా ఈ భామ బాలీవుడ్‌లో అరంగేట్రం చేస్తూ నటిస్తున్న వెబ్ సిరీస్ 'అక్క'. పీరియాడిక్ థ్రిల్లర్ కథాంశంతో తెరకెక్కనున్న ఈ సిరీస్‌ను బాలీవుడ్ అగ్ర నిర్మాణ సంస్థ యష్‌రాజ్ ఫిల్మ్స్ నిర్మిస్తున్నది. ధర్మరాజ్ శెట్టి దర్శకత్వం వహిస్తున్నారు. ఈ సిరీస్‌లో రాధికా ఆప్టేతో కలిసి నటించనుంది కీర్తి సురేష్. త్వరలో సెట్స్‌పైకి వెళ్లనుంది. ప్రస్తుతం ఈ సిరీస్ తాలూకు రిహార్సల్స్ ముంబయిలో జరుగుతున్నాయి. సోమవారం ముంబయిలో అడుగుపెట్టిన కీర్తి సురేష్ తన తొలి బాలీవుడ్ వెబ్ సిరీస్ గురించి ఆసక్తిగా ఎదురుచూస్తున్నట్లు చెప్పింది. బాలీవుడ్‌లో తన ప్రయాణం ఈ సిరీస్‌తో మొదలుకావడం ఆనందంగా ఉందని, తాను పోషించిన పాత్ర కూడా పూర్తి కొత్తదనంతో ఉంటుందని కీర్తి సురేష్ పేర్కొంది. నెట్‌ఫ్లిక్స్‌లో ఈ సిరీస్ స్ట్రీమింగ్ కానుంది. కీర్తి సురేష్ ప్రస్తుతం తమిళంలో సైరన్, రఘుతాథ, రివాల్వర్ రాణి, కన్నివేడి వంటి చిత్రాల్లో నటిస్తూ బిజీగా ఉంది.

## వైమానిక వీరుని కథ

వైమానిక వీరుల పరాక్రమాలను, విధి నిర్వహణలో వారు ఎదుర్కొన్న సవాళ్లను ఆవిష్కరిస్తూ తెరకెక్కిస్తున్న చిత్రం 'ఆపరేషన్ వాలైంటైన్'. తెలుగు, హిందీ భాషల్లో రూపొందిస్తున్న ఈ చిత్రానికి శక్తిప్రతాప్ సింగ్ దర్శకుడు. మానుషి చిల్లార్ కథానాయిక. సందీప్ ముద్దా నిర్మాత. ఈ చిత్రాన్ని ఫిబ్రవరి 16న విడుదల చేయబోతున్నారు. త్వరలో టీజర్ రిలీజ్ కానుంది. దర్శకుడు మాట్లాడుతూ ' ఈ సినిమాలో వరుణ్‌తేజ్ ఎయిర్ పైలట్‌గా కనిపిస్తాడు. రాడార్ ఆఫీసర్ పాత్రలో కథానాయిక మానుషి చిల్లార్ నటిస్తున్నది. ఎయిర్‌ఫోర్స్ నేపథ్యంలో వస్తున్న తొలి తెలుగు చిత్రమిది. దేశం ఎదుర్కొన్న అతిపెద్ద వైమానిక దాడుల నేపథ్యంలో యదార్థ సంఘటనల స్ఫూర్తితో ఈ సినిమాను తెరకెక్కించాం. దేశభక్తి ప్రధానంగా ఆకట్టుకుంటుంది. 'మేజర్' వంటి విజయం తర్వాత సోనీ పిక్చర్స్ సంస్థ నిర్మిస్తున్న ఈ చిత్రం తప్పకుండా ప్రేక్షకాదరణ సొంతం చేసుకుంటుందనే నమ్మకం ఉంది' అని చిత్రబృందం పేర్కొంది.

